సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 3 । జూన్ । 2025



మెట్ట రైతులను ఆదుకోవాలి

గత ఆరు నెలలుగా సరైన గిట్టుబాటు ధర లేక మెట్ట రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గురునాథరావు అన్నారు. IIలో ▸



క్రికెట్ జట్ల ఎంపిక

అంతర జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల సెలెక్షన్స్ జరిగాయి. అండర్‌-15, 19 బాలికల జట్లు, అండర్‌-19 పురుషుల జట్లను ఎంపిక చేశారు. IIలో ▸



కలిసిరాని వేసవి

వేసవిలో జోరుగా సాగే తాటి ముంజెల వ్యాపారం ఈ ఏడాది అంతంత మాత్రంగానే ఉంది. కనీసం కూలి డబ్బులు కూడా రాలేదని వ్యాపారులు వాపోతున్నారు. IIలో ▸

న్యూస్‌రీల్

చట్టపరిధిలో పరిష్కారం



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

భీమవరం: ప్రజాసమస్యలపై త్వరితగతిన స్పందించి నిర్దిష్ట సమయంలో చట్టపరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులు ఆదేశించారు. సోమవారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్‌)లో ప్రజల నుంచి 17 అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులు ఆదేశించారు. పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా ఉండాలన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ సీఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు పరిహారం

భీమవరం: ఆకివీడు–దిగమర్రు ఎన్‌హెచ్‌–165కు సంబంధించి భూములిచ్చిన ఆకివీడు దుంపగడప, అజ్జమూరు తదితర గ్రామాల రైతులకు రూ.7.40 కోట్ల పరిహారాన్ని చెల్లిస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సీహెచ్ నాగరాణితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అలాగే లక్ష్మణేశ్వరం, సీతారాంపురం, మొగల్తూరు రైతులకు సుమారు రూ.6 కోట్లు చెల్లించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 40 ఆర్‌యూబీ, ఆర్వోబీలనిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌హెచ్ ఈఈ సంజీవరాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ధర్నా



భీమవరంలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

భీమవరం: హౌస్ ఫర్ ఆల్ అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారామ్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఎన్నికల్లో కూటమి ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలిస్తామన్న కూటమి హామీని అమలు చేయాలన్నారు. అనంతరం వినతిపత్రం, అర్జీలను తహసీల్దార్ ఆర్.రాంబాబుకు అందజేశారు.

తాడేపల్లిగూడెంలో..

పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని, జీఓ 23ను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద హౌస్ ఫర్ ఆల్ అంటూ ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆయిల్‌పామ్ రైతుల ఆక్రోశం

ద్వారకాతిరుమల: కేంద్ర ప్రభుత్వం పామాయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఎం.నాగులపల్లిలో ఆయిల్‌పామ్ గెలల కాటా వద్ద ఆయిల్‌పామ్ రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయిల్‌పామ్‌కు గిట్టుబాటు ధర కల్పించాలని, ఫ్యాక్టరీ యాజమాన్యాలు గెలల ఏరివేతను ఆపాలంటూ నినాదాలు చేశారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దిగుమతి సుంకం తగ్గింపుపై పునరాలోచన చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, మండల అధ్యక్షుడు బోయపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల వినూత్న నిరసన

భీమడోలు: కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని, భూయాజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం భీమడోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద కౌలు రైతులు ధర్నా చేశారు. మండుటెండలో మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి, ఏఓ ఎస్‌పీవీ ఉషారాణికి వినతిపత్రం అందించారు.

ఆడబిడ్డలకు ద్రోహం



కష్టం విలువ తెలిసిన వ్యక్తిని.. సంపద సృష్టి తెలిసిన పార్టీ మా పార్టీ.. ఆడబిడ్డల కోసం మహాశక్తి కార్యక్రమం తీసుకువస్తున్నాం.. ప్రతి మహిళను మహాశక్తిగా తయారుచేయాలన్నదే నా సంకల్పం.. అందుకే ఆడబిడ్డ నిధి పథకాన్ని తెస్తున్నాం.. ఇంటిలో ఇద్దరుంటే.. ఇద్దరి అకౌంట్లకు కూడా ఇస్తాం.. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు వారికి నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని ఈ రోజు మీ అన్న మీకు వరం ఇస్తున్నాడు.

– ఇవి సార్వత్రిక ఎన్నికల సభల్లో చంద్రబాబు చెప్పిన మాటలు

ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, కూటమి నేతలు ఎక్కడకు వెళ్లినా ఆడబిడ్డ నిధి అంటూ ఊదరగొట్టారు. తమ ప్రభుత్వం రావడమే ఆలస్యం డబ్బులు ఖాతాల్లోకి వస్తాయంటూ హోరెత్తించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండగా ఆడబిడ్డ నిధి అమలు ఊసెత్తడం లేదు. మరోపక్క ఈ పథకం సాయం కోసం పేదింటి మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మోసం ఇంతింతై!

- ప్రభుత్వం రాగానే ఆడబిడ్డ నిధి పథకం అమలుకు కూటమి హామీ
- 19 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1,500
- పథకం అమలు ఊసెత్తని ప్రభుత్వం
- జిల్లాలో అర్హులు సుమారు 5.96 లక్షల మంది
- ఏడాది కాలానికి రూ.1,073 కోట్లు నష్టపోయిన జిల్లాలో మహిళలు
- ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తంతో మహిళలకు అండగా జగన్ సర్కారు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల నాటికి జిల్లాలో మహిళా ఓటర్లు 7,51,313 మంది ఉన్నారు. వృద్ధాప్య పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు 1,26,061 మంది ఉండగా వారిలో మహిళలు 60 శాతం ఉంటారని అంచనా. ఈ మేరకు ఓఏపీ లబ్ధిదారులు 75,636 మంది ఉండగా, వితంతు 49,564, ఒంటరి మహిళ 6,926, అభయహస్తం 8,908, దివ్యాంగులు సుమారు 14,000 మంది కలిపి మహిళా లబ్ధిదారులు 1,55,034 మంది ఉన్నారు. వీరిని మినహాయించిన కూటమి మేనిఫెస్టో మేరకు జిల్లాలో ఆడబిడ్డ నిధి పథకానికి 5,96,279 మంది అర్హులు ఉన్నారని అంచనా. ఈ మేరకు నెలకు రూ. 89.44 కోట్లు చొప్పున ఏడాది కాలానికి గాను రూ.1,073 కోట్లు మేర ప్రభుత్వ సాయాన్ని ఆడబిడ్డలు నష్టపోవాల్సి వచ్చింది. ఇప్పటికీ పథకం మాటెత్తకపోగా ఎప్పటి నుంచి అమలుచేసేది సర్కారు స్పష్టతనీయడం లేదు.

గత ప్రభుత్వంలో మహిళలకు పట్టం

కులమతవర్గాలు, రాజకీయాలకు అతీతంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆడపడుచులకు అండగా నిలిచింది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం తదితర పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించింది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా జిల్లాలోని 2,70,380 మంది డ్వాక్రా మహిళలకు రూ.1,107 కోట్ల రుణాలను మాఫీ చేశారు. బీసీ మహిళలకు వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ. 18,750 చొప్పున జిల్లాలో సగటున 61,750 మందికి నాలుగేళ్లలో రూ.463.41 కోట్ల సాయాన్ని అందించారు. కాపునేస్తం పథకం కింద కాపు, బలిజ, ఒంటరి, తెలగ సామాజిక వర్గానికి చెందిన సుమారు 28,004 మంది మహిళలకు నాలుగేళ్లలో రూ.168.02 కోట్లు అందజేశారు. ఈబీసీ నేస్తం పథకం కింద రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య తదితర ఓసీ సామాజికవర్గాల్లోని 12,827 మంది మహిళలకు నాలుగేళ్లలో రూ. 57.71 కోట్లు సాయం అందించారు.

హామీలు నిలబెట్టుకోవాలి



ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలులోకి తేవాలి. 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున బ్యాంకు ఖాతాకు జమచేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ పథకం అమలుకోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నాం. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు.

– బందెల ప్రమీల, గృహిణి, చెరుకువాడ

సూపర్ దగా



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఆడబిడ్డ నిధి పథకం అమలుపై క్లారిటీ లేదు. సూపర్ సిక్స్ అంటూ వచ్చి ప్రజల్ని సూపర్‌గా దగా చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పేదలందరినీ మాజీ సీఎం జగన్ ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం వంచన తప్ప చేసిందేమీ లేదు.

– కోడే విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, భీమవరం

గత ప్రభుత్వంలో మహిళలకు పథకాల లబ్ధి

వైఎస్సార్ ఆసరా (డ్వాక్రా రుణమాఫీ)

నియోజకవర్గం	సంఘాలు	రుణమాఫీ మొత్తం (రూ.కోట్లలో)
భీమవరం	2,924	115.80
ఆచంట	3,701	148.08
నరసాపురం	3,150	132.08
ఉండి	5,239	251.04
తాడేపల్లిగూడెం	2,900	101.12
తణుకు	4,147	166.00
పాలకొల్లు	3,839	154.48
గణపవరం మండలం	1,138	37.36

వైఎస్సార్ చేయూత

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
2020–21	51,516	97.00
2021–22	51,000	96.00
2022–23	70,212	131.15
2023–24	74,274	139.26

వైఎస్సార్ కాపు నేస్తం

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
2020–21	24,199	36.30
2021–22	21,815	32.72
2022–23	31,361	47.04
2023–24	34,642	51.96

ఈబీసీ నేస్తం

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
2021–22	11,997	17.99
2022–23	13,460	20.19
2023–24	13,024	19.53

బాబు మోసం ప్రజలకు అర్థమవుతోంది



వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, నాయకులు

- మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ
- 4న వెన్నుపోటు దినం నిరసన జయప్రదానికి పిలుపు

తాడేపల్లిగూడెం అర్బన్: చంద్రబాబు ఎన్నికల సందర్భంగా చెప్పిన మోసపు మాటలు, అబద్ధపు హామీలు ప్రజలకు క్రమేపీ అవగతమవుతున్నాయని, ఏడాది పాలనలో ఒక్క హామీని కూడా అమలు చేయని తీరును గమనించి మరోసారి బాబు మోసపు మాటలకు బలయ్యామని భావిస్తున్నారని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 4న నిర్వహించనున్న బాబు వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థిక లబ్ధిని పొందిందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. తల్లికి వందనం, నిరుద్యోగభృతి, స్త్రీశక్తి పథకాలు, ఉచిత బస్సు ప్రయాణం హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఢిల్లీ నుంచి అప్పులు తెచ్చేందుకు అధికారం చేపట్టినట్టు ఉందన్నారు. తీసుకువచ్చిన అప్పులు ఏమి చేశారో తెలియడం లేదన్నారు. ఉద్యోగులకు ఈనెల జీతాలు ఇచ్చేందుకు మరో రూ.7 వేల కోట్లు అప్పు తీసుకున్నారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రోజుకో ధోరణితో డైలాగులు చెప్పడమే కాని ఆయన వల్ల ప్రజలకు ఉపయోగం ఏమీ లేదన్నారు.

ప్రజలు విసిగిపోయారు

నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, నియోజకవర్గ పరిశీలకుడు పప్పుల రామారావు మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలనకు ప్రజలు విసిగిపోయారన్నారు. హామీలను గాలికి వదిలేసిన చంద్రబాబు చేసిన అరాచకాలు, అన్యాయాలపై ఈనెల 4న బాబు వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పెంట్ర వీరన్న, నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, జిడ్డు హరిబాబు, ముప్పిడి సంపత్‌కుమార్, ఎంపీపీ దాసరి హైమావతి, బోణం విజయనిర్మల, పత్సమట్ల సావిత్రి, కైకాల శ్రీనివాస్, తగరం పూడి మరళీ, సిర్రాపు శాంతకుమార్, సగరం ప్రసాద్, అరామిల్లి రవి, కొవ్వూరి విజయభాస్కరరెడ్డి, తాడేపల్లిగూడెం పట్టణ, పెంటపాడు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి

కలెక్టర్ నాగరాణి



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, జేసీ

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)లో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. మొత్తం 137 అర్జీలు స్వీకరించారు.

అర్జీల్లో కొన్ని..

- ఆకివీడు మండలం కుప్పనపూడికి చెందిన ఎర్రగోగు రామాంజనేయులు తన భూమిని సర్వే చేయించి హద్దులు చూపాలని కోరారు.
- గణపవరం మండలం కొత్తపల్లికి చెందిన ఆక్వా రైతులు కలవరామ సుబ్బారావు, బొడ్డు అప్పారావు, బి.మధు, తదితరులు గ్రామంలో చేపల చెరువులకు వెళ్లే మార్గం ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు.
- అత్తిలి మండలం కంచుమర్రుకి చెందిన ఎం.జయప్రసాద్ గ్రామంలో పంట బోదె పూడుకుపోయిందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.
- తాడేపల్లిగూడెంలోని 35 వార్డు చెందిన బండారు పార్వతి తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని అర్జీ అందించారు.

బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

పశ్చిమగోదావరిని బాల కార్మికరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీతో సమావేశమై బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈనెల 30 వరకు జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నామన్నారు. జూన్ 5న 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా చేపట్టాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

5 నుంచి ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఉండి: పశ్చిమగోదావరి జిల్లాలోని 2 ప్రభుత్వ, 16 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఈనెల 5 నుంచి మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. తొలిరోజు మెరిట్ నంబర్ 1–100, 6న ఉదయం 110–189, మధ్యాహ్నం 190–270 వచ్చిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 08816 297093, 9676099988 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (టూటౌన్): 2025–26కి సంబంధించి ఐటీఐ ప్రవేశాలకు ఈనెల 5న ఏలూరులో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఏలూరు ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రజిత సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5 ప్రభుత్వ ఐటీఐల్లో 804, 14 ప్రైవేట్ ఐటీఐల్లో 1,672 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం మెరిట్ నంబర్ 1–110, మధ్యాహ్నం 110–202 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

రెండో రోజూ.. అవే పాట్లు

కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన రేషన్ షాపుల వద్ద నిత్యావసరాల పంపిణీ రెండో రోజు సోమవారం కూడా కార్డుదారులకు అవస్థలను తెచ్చిపెట్టింది. చాలాచోట్ల సర్వర్ పనిచేయకపోవడంతో వృద్ధులు, మహిళలు డిపోల వద్ద పడిగాపులు పడ్డారు. ఇంటికే రేషన్ పంపిణీని నిలిపివేసి మళ్లీ మోత కష్టాలు తెచ్చారంటూ నిట్టూర్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రేషన్ సరుకుల కోసం కార్డుదారులు ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్



పెనుగొండ: బియ్యం మూటతో వృద్ధురాలి అవస్థలు



మోత కష్టాలు మొదలు



తణుకు అర్బన్: తణుకులో రేషన్ డిపో వద్ద వేచి చూస్తూ..



తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులకూ తప్పట్లేదు..



భీమవరం అర్బన్: లోసరిలో సర్వర్ మొరాయించడంతో..

క్లుప్తంగా

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శశి విద్యార్థుల ప్రతిభ



ఎస్‌కే ఆజాం ఖాన్, ఆలిండియా 16వ ర్యాంక్

తాడేపల్లిగూడెం (టీఓసీ) : జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025లో శశి తాడేపల్లిగూడెం విద్యార్థులు ఆలిండియా ర్యాంక్‌లు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఎస్‌కే ఆజాం ఖాన్ ఆలిండియా 16వ ర్యాంక్ సాధించినట్లు వెల్లడించారు. ఎ.ప్రసాద్ 4,111, పి.శ్రీలేఖ 4,915, పి.చరణ్ 6,058, కె.దేవిక 6,637, వి.హరిచరణ్ 12,259 ర్యాంక్‌లు వచ్చాయని చెప్పారు. విజయం సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను చైర్మన్‌తో పాటు విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, అకడమిక్ డైరక్టర్ క్రాంతి సుధలు అభినందించారు.

విద్యా శాఖ అధికారుల బాధ్యతల స్వీకరణ

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో నలుగురు అధికారులు సోమవారం విధుల్లో చేరారు. జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్–2గా ఎన్. వెంకటప్పయ్య, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌గా ఏ.జయలక్ష్మి, పరీక్షల విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా వి.సుధాకర్, డీఈఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా కే.పావని బాధ్యతలు స్వీకరించారు.

కలిసిరాని వేసవి

- తాటిముంజెల వ్యాపారుల ఆవేదన
- అకాల వర్షాలు, చల్లబడ్డ వాతావరణంతో సాగని వ్యాపారం



కొనుగోలుదారులు రాక ఖాళీగా ఉన్న ముంజెల వ్యాపారులు



గణపవరం: వేసవి అనగానే మనకు గుర్తుకొచ్చేవి తాటి ముంజెలు. మండే ఎండల్లో వేసవితాపం నుంచి తక్షణ ఉపశమనం కోసం తాటిముంజెలు ఇష్టపడని వారుండరు. వేసవిలో గ్రామాలు, పట్టణాల్లో సైకిళ్ల మీద తాటిముంజెల అమ్మకాలు చేస్తూ వందల మంది కనిపిస్తుంటారు. ప్రధాన రహదారులలో చెట్ల కింద తాటి గెలలు తెచ్చి అక్కడికక్కడే కోసి ముంజెలు అమ్ముతారు. వేసవిలో రోజుకు కనీసం రూ.1000 నుంచి రూ.3 వేల వరకూ ఆదాయం పొందుతారు. మెట్ట ప్రాంతాలైన తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, నల్లజర్ల, ద్వారకాతిరుమల తదితర మండలాలనుంచి తాటిముంజెలు తెస్తారు. ప్రతీ ఏటా వేసవిలో జోరుగా సాగే తాటి ముంజెల వ్యాపారం ఈ వేసవిలో అంతంత మాత్రంగానే ఉంది. కనీసం కూలి డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఈ వేసవి ఆరంభం నుంచి వర్షాలు, మబ్బులతో వాతావరణం పూర్తిగా చల్లబడటంతో ప్రజలు తాటి ముంజెల కొనుగోలుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎండలు తీవ్రంగా ఉండే మే నెల రెండోవారం నుంచి వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. రోహిణీ కార్తె ఎప్పుడు వచ్చిందో కూడా తెలియని విధంగా వాతావరణం చల్లబడిపోవడంతో తాటిముంజెల వ్యాపారం పూర్తిగా చతికిలబడింది. రోజూ మధ్యాహ్ననికే తాటి ముంజెలన్నీ అమ్ముకుని ఇళ్లకు వెళ్లేవారమని, ఈఏడాది రోజంతా అమ్మినా సగం ముంజెలు మిగిలిపోవడంతో వాటిని పారవేస్తున్నామని గగ్గోలు పెడుతున్నారు.

రోజుకు రూ.800 నుంచి రూ.900 ఖర్చు

తాటిముంజెల కోసం ఒక్కో చెట్టు ఎక్కి గెలలు నరకడానికి రూ.100 చొప్పున ఖర్చు చేస్తారు. రోజుకు నాలుగైదు చెట్ల నుంచి గెలలు సేకరిస్తారు. కాయల నుంచి ముంజెలు తీయడానికి మరో రూ.200 ఖర్చవుతుంది. గ్రామాలకు తీసుకెళ్లడానికి పెట్రోలుకు రూ.100, టిఫిన్, టీ, భోజనం ఖర్చు మరో రూ.100 కలిపి మొత్తం రూ.800 నుంచి రూ.900 వరకూ అవుతుంది. తెచ్చిన ముంజెలు మొత్తం అమ్ముడు పోతే రూ. 2 వేల నుంచి రూ.2500 వరకు వస్తుంది. ఖర్చులు పోను రోజుకు రూ.12 వందల నుంచి రూ.15 వందల వరకూ మిగులుతుంది. ప్రస్తుత వేసవిలో రోజంతా అమ్మినా రూ.1000 నుంచి రూ.15 వందలు రావడమే గగనంగా ఉందని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

ఈ సీజన్ అంతా నష్టమే



పదేళ్లుగా తాటిముంజెల వ్యాపారం చేస్తున్నాను. మా గ్రామం నుంచి సుమారు 20 మంది ఈ వ్యాపారం చేస్తుంటారు. ఈ వేసవిలో ఎదుర్కొన్నంత గడ్డు పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. ప్రతీ వేసవిలో రోజుకు కనీసం రూ.1500పైగా మిగిలేది. సీజన్ మొత్తం అన్ని ఖర్చులు పోను రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ ఆదాయం పొందేవారం. ప్రస్తుతం రోజుకు రూ.1000 అమ్మడమే గగనంగా ఉంది.

చదలవాడ నాగరాజు, తాటిముంజెల వ్యాపారి, నీలాద్రిపురం, ఉంగుటూరు మండలం

మెట్ట రైతులను ఆదుకోవాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం : గత 6 నెలలుగా సరైన గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు అన్నారు. సోమవారం జంగారెడ్డిగూడెంలో ఆయన మాట్లాడుతూ పామాయిల్, పొగాకు, కోకో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. పామాయిల్ మార్కెట్‌లో రూ.20,000 ధర పలుకుతుంటే కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం 26 శాతం నుంచి ఒక్కసారిగా 10 శాతం తగ్గించడం వల్ల ధర తగ్గే పరిస్థితులు కనబడుతున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని, పామాయిల్ ధరలు రూ.15 వేలకు పడిపోయే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. పొగాకు రైతులకు సరైన గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని, వెంటనే పొగాకు రైతులకు గిట్టుబాటు ధర అందించాలని కోరారు. కోకో అంతర్జాతీయ మార్కెట్లో రూ.800 పైగా ఉంటే రాష్ట్రంలో కేవలం కేజీ రూ.400కు మాత్రమే కొంటున్నారని, రైతులను పూర్తిగా నష్టాల పాలు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని.. అవసరమైతే ఈ ప్రాంతం తీసుకొచ్చి రైతుల దుస్థితిని వివరిస్తామని చెప్పారు. రైతులు అధైర్య పడవద్దని గిట్టుబాటు ధర కోసం కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొద్దామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మళ్లిడి బాబి, కొయ్యే లీలాధర్ రెడ్డి, ఇర్ల శ్రీనివాస్ రెడ్డి, అట్లూరి రామరాజు, సీతంపేట మాజీ సర్పంచ్ మిరియాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ ఇంటికే అందించాలి

ఏలూరు (టూటౌన్) : రేషన్ సరుకులు వద్దనుకుంటే నగదు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, అన్ని నిత్యావసర సరుకులు నేరుగా పేదల ఇళ్ల వద్దకే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున పార్టీ జిల్లా కార్యదర్శి సోమవారం ప్రకటన విడుదల చేశారు. రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారనే పేరుతో దొడ్డిదారిన నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. నగదు బదిలీ ప్రవేశపెట్టడమంటే ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రజల నుంచి దూరం చేయడమేనని అన్నారు. మార్కెట్లో బియ్యం ధరలు పెరిగినా ప్రభుత్వం ఇచ్చే నగదు మాత్రం పెరగదని, అంతిమంగా పేద ప్రజలు నష్టపోతారని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు వెళ్ళినవారికి 2, 3 నెలలకొకసారి తీసుకునే వెసులుబాటు కల్పించాలి తప్ప ప్రజా పంపిణీ వ్యవస్థను కుదించే ప్రయత్నాలు చేయడం మంచిదికాదన్నారు. రేషన్ సరుకులు నేరుగా ఇళ్ల వద్దకే చేరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా శాఖా కార్యదర్శుల విస్తృత సమావేశం జూన్ 3న జంగారెడ్డిగూడెంలో రోటరీ క్లబ్ హాలులో జరుగుతుందని పార్టీ కార్యదర్శి ఎ.రవి తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యకు పరిష్కారం

సాక్షి స్పందన



ట్రాన్స్‌ఫార్మర్‌లో లోడ్ సమస్యలు పరిశీలిస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరులోని ట్రాన్స్‌ఫార్మర్‌లో తలెత్తిన సమస్యలను విద్యుత్ సిబ్బంది సరి చేశారు. 'ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్యలు' శీర్షిక సాక్షి పత్రికలో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ పెరగడంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు విద్యుత్ లేక స్థానికులు ఇబ్బందులు పడ్డారు. గుర్తించిన విద్యుత్ అధికారులు, సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి మూడు ఫేజ్ పవర్ సిస్టమ్‌లో ఒక ఫేజ్‌లో అత్యధిక సర్వీస్‌లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని సమానంగా సర్దుబాటు చేశారు. అధిక లోడ్‌ను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను తప్పక మార్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

ఆకివీడు : డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ హనుమంతు నాగరాజు చెప్పారు. అలాగే దుబాయ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4.60 లక్షలు తీసుకుని మోసగించిన కాట్రేనికోన మండలం పెనుమాలకు చెందిన రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని మందపాడు గ్రామానికి చెందిన గండికోట వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. స్థానిక ఏటీఎంలో డబ్బు డ్రా చేసేందుకు వెళ్లిన విశ్రాంతి ఉద్యోగి పాపోలు శశిధర్ తిలక్ ఏటీఎం కార్డును దొంగిలించి రూ.48 వేలు డ్రా చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదానికి గురై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు. వేలేరుపాడు మండలం మేడేపల్లి గ్రామానికి చెందిన కట్టం కన్నారావు (23) గత నెల 27న బైక్‌పై వెళ్తుండగా.. మండలంలోని వేగవరం కాలనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఉన్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో లారీ ఢీకొన్నాడు. కన్నారావు తలకు గాయం కాగా.. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ముగ్గురు దేవస్థానం ఉద్యోగులకు పదోన్నతులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలో పనిచేసే ముగ్గురు ఉద్యోగులకు సోమవారం పదోన్నతులు లభించాయి. ఇప్పటి వరకు ఆలయ సూపరింటిండెంట్‌గా పనిచేసిన రమణరాజు ఏఈఓగా, సీనియర్ అసిస్టెంట్ ఎంఎస్‌వీ రాధిక సూపరింటిండెంట్‌గా, జూనియర్ అసిస్టెంట్ దాసరి నవీన్ కృష్ణ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు పొందారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదు

ఏలూరు (టూటౌన్): చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 66,363 మంది విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారని, అందులో ఇప్పటికే 11,000 మంది విద్యార్థులకు పైగా ఉత్తీర్ణులు అయ్యారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ కుమార్ చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చాలామంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీలో సీట్లు కూడా కోల్పోయారని.. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పది ఫలితాలు ఎన్నడు లేని విధంగా పరీక్ష పూర్తయిన 22 రోజులకే విడుదల చేశామని గొప్పలు చెప్పుకున్నారని అన్నారు. ప్రచారం ఆర్భాటంలో ఉన్న శ్రద్ధ విద్యార్థులకు సరైన ఫలితాలు ఇవ్వడంలో విఫలం చెందారని ఆరోపించారు. ఫలితాల్లో విద్యార్థులు ఫెయిల్ కాలేదని, కూటమి ప్రభుత్వం మాత్రమే ఫెయిల్యూర్ పాలన అందిస్తోందన్నారు.

కోడిపందేలపై దాడి

చాట్రాయి: మండలంలోని కోటపాడులో కోడిపందేలపై దాడి చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. కోటపాడులో పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు.. కోడిపుంజు, రెండు కోడి కత్తులు, 5 బైక్‌లు, రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆత్మహత్యాయత్నం ఘటనలో మరొకరి మృతి

జంగారెడ్డిగూడెం: కుటుంబం ఆత్మహత్యాయత్నం ఘటనలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మే 29న అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో జంగారెడ్డిగూడెంకు చెందిన మంగిన సత్యదుర్గ చంద్రరావు, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మెరుగైన వైద్యం కోసం నలుగురిని గుంటూరు ఆసుపత్రికి తరలించగా, 30న చంద్రం చికిత్స పొందుతూ మృతిచెందారు. సోమవారం రాత్రి భార్య కృష్ణజ్యోతి (35) మృతిచెందినట్లు తెలిపారు. ఇద్దరు పిల్లలు దుర్గాచరణ్, కోమలి చికిత్స పొందుతున్నారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు

ఉండి: వృద్ధ దంపతులపై దాడి ఘటనలో ఆరుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాములపర్రు శివారు కొండగూడెం ప్రాంతానికి చెందిన బొండాడ నాగమణి, ఆమె భర్త నర్సింహంపై ఇంటిపక్కనే ఉంటున్న కలవపల్లి సాయితో పాటు మరో ఐదుగురు గత నెల 30న ఉదయం 8 గంటలకు దాడి చేశారు. దాడిలో గాయపడిన నాగమణి భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్ కుమార్, ఆర్.మణి సింగ్ తదితరులు

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను అమలు చేయాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు వాటిని కాలరాస్తున్నారని, రక్షించాల్సిన వారే వాటిని భక్షించే పరిస్థితి నెలకొందని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ఏఐఆర్‌డీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.మణి సింగ్ అన్నారు. స్థానిక లేడీస్ క్లబ్‌లో ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అంశంపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు మానవ హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ముఖ్యంగా దళితులపై అరాచకాలకు పాల్పడుతూ వారి పట్ల వివక్షతను కొనసాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో రెవెన్యూ,పోలీస్ వ్యవస్థలు వైఫల్యం చెందాయని.. పిఠాపురం నియోజకవర్గం, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో దళితులపై జరిగిన దాడులే నిదర్శనమన్నారు. సమావేశంలో అటవీ శాఖ మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్ కుమార్, డాక్టర్ నిట్టా ప్రసాద్, దాసరి రమేష్, దోమతోటి అబ్రహాం, సింగవరపు జ్యోతి, విజయ కుమారి, మాముడూరు మహంకాళి, నూకపెయ్యి కార్తీక్, లాయర్ రాజశేఖర్, కనికెళ్ళ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏజీవైలో రూ.1.20 కోట్ల మంజూరు



పీఎంఏజీవై పథకం అమలుపై నిర్వహించిన మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్) : ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంలో జిల్లాలో గుర్తించిన ఆరు గ్రామాలకు రూ.1.20 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో పీఎంఏజీవై పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2020–21 సంవత్సరంలో పీఎంఏజీవై పథకం అమలుకు 50 శాతం పైగా ఎస్సీ జనాభా ఉన్న 10 గ్రామాలను, 2022–23 సంవత్సరంలో 40 శాతం పైగా ఎస్సీ జనాభా కలిగిన 11 గ్రామాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు సమర్పించామన్నారు. వీటిలో 6 గ్రామాలకు ఒక్కో గ్రామానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.1.20 కోట్లు మంజూరు చేశారన్నారు. మరో నాలుగు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ప్రకటించినట్లు చెప్పారు. ఇంకా గ్రామ అభివృద్ధి ప్రణాళిక సమర్పించాల్సిన 11 గ్రామాలకు కూడా వీడీపీలు సమర్పించాలన్నారు. ఈ నిధులను తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, పౌష్టికాహారం, సామాజిక భద్రత, గ్రామీణ రహదారులు, గృహ నిర్మాణాలు, విద్యుత్ తదితర అవసరాలకు వినియోగించాలన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయరాజు, ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి వై.దోసిరెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, డీఈవో ఇ.నారాయణ, డీఎం అండ్ హెచ్ జి.గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

కుక్కలను చంపిన ఘటనలో ఇద్దరిపై కేసు

ఏలూరు టౌన్: ఏలూరు శనివారపుపేట చింతమనేని కాలనీ ప్రాంతంలో కోళ్ల ఫాంలోకి కుక్కలు వెళ్ళి దాడిచేసి తింటున్నాయనే నెపంతో ఇద్దరు వ్యక్తులను తీసుకొచ్చి 9 కుక్కలను చంపిన సంఘటనపై త్రీటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కాకినాడకు చెందిన సూరాబత్తుల గోపాలరావు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు. ఈ నెల 27 సాయంత్రం 4.30 గంటలకు శనివారపుపేట ఏటిగట్టు శివారు ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి తుపాకీతో ఆ ప్రాంతంలో ఉన్న 9 కుక్కలను చంపి వెళ్ళిపోయారు. ఈ సంఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాలతో పోలీస్ అధికారులు స్పందించారు. జంతు సంరక్షణ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఫిర్యాదుతో ఏలూరు త్రీ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకటి, రెండు రోజుల్లో కేసుకు నిందితులను అరెస్టు చేస్తామన్నారు.

జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

ఏలూరు రూరల్ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి, మూలపాడు, గుంటూరులో అంతర జిల్లాల మహిళలు, పురుషుల క్రికెట్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా త్రిసభ్య కమిటీ సభ్యులు ఆర్‌ఎస్‌ఆర్ మూర్తి, ఈ అశోక్ కుమార్, షాకీర్ హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు.

అండర్–15 బాలికల జట్టు

ఈ నెల 9 నుంచి 12 వరకూ మంగళగిరిలో అండర్–15 బాలికల పోటీలు జరగున్నాయని తెలిపారు. జట్టులో పి.రిషిక కృష్ణన్(కెప్టెన్), జి.తాస్యశ్రీ (వైస్ కెప్టెన్), ఏ రత్నగ్రేసీ, ఎం.శ్రీలలిత శివమాధురి, జి.నిత్యశ్రీ, ఎం.సంజన, డి.కేశవ వర్ధని, టి.యశశ్రీ, బి.దీపిక, సీహెచ్ ప్రియ, ఎం.సౌజన్య, ఎన్.గీతామౌనిక, డీఎస్‌వి చాందని, ఎం.హేమలత దేవి, ఎం.తేజశ్రీ

అండర్–19 బాలికల జట్టు

ఈ నెల 14 నుంచి 17 వరకూ మంగళగిరిలో జరగనున్నాయి. జట్టుకు పి.రిషికకృష్ణన్(కెప్టెన్), ఓ.సహితశ్రీ(వైస్ కెప్టెన్), కెవైఎం మల్లి, టి.భావ్యశ్రీ, జీకే స్పందన, ఎం.షరోన్, జి.తాస్యశ్రీ, టి.మధుశాలిని, ఈజెవై సాయిజ్యోత్స్న, టి.అనూష, కె.పూజ, జె.మీనా, టి.చిన్నబుజ్జి, ఎం.మోక్షిత, కె.లీలాసాయి ప్రసన్న, కెవైఎం వల్లి

అండర్–19 పురుషుల జట్టు

ఈ నెల 10 నుంచి 13 వరకూ గుంటూరులో పోటీలు జరగనున్నాయి. జట్టులో కె.ప్రణీత్ పవన్(కెప్టెన్), వీఎంవీఎస్ రక్షణన్(వైస్ కెప్టెన్), పి.దీక్షిత్ బాబు(వికెట్ కీపర్), సీహెచ్.వినయ్, ఓ.రణదీప్, సీహెచ్.వైభవ్ రాజ్, ఆర్.చంద్ర ఆషిక్, రేవంత్‌వర్మ, పొన్నన్ నారాయణ, టి.లలిత పవన్, జె.సాయిరామ్, జె.శేయర్, పి.తేజ, కె.సాయికీర్తన్, మణిశంకర్.

సైబర్ కేసు నమోదు

ఏలూరు టౌన్: పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై కక్ష గట్టిన మరో ఉపాధ్యాయిని అసత్య ప్రచారాలు చేస్తూ వేధింపులకు గురిచేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ వేధిస్తుండడంతో.. తనకు న్యాయం చేయాలంటూ హెచ్‌ఎం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేసి నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామవరపుకోట మండలం ఆడమిల్లి జెడ్పీ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సెలవులు ఇవ్వకపోవడం, పాఠశాల సమయంలో సెల్‌ఫోన్ వాడొద్దని అదే పాఠశాలలో పనిచేస్తున్న హిందీ టీచర్ శ్రీవల్లిని హెచ్చరించారు. దీంతో కక్ష పెంచుకున్న టీచర్.. తన పనిమనిషి పేరిట బాధితురాలి బంధువులు, కుటుంబ సభ్యులు, పాఠశాలలో పనిచేస్తున్న మిగిలిన ఉపాధ్యాయులకు మెసేజ్‌లు పెట్టేవారు. అసభ్యంగా మెసేజ్‌లు పెట్టడంతో.. బాధితురాలు ఏలూరు సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు కేసును మహిళా పోలీసు స్టేషన్‌కు బదలాయించారు. అపరిచిత వ్యక్తి ఎవరు అని తెలుసుకునేందుకు పాఠశాలకు వెళ్లి అనేక కోణాల్లో విచారణ చేశారు. చివరకు హిందీ టీచరే ఈ నేరానికి పాల్పడినట్లు తెలుసుకుని ఆమెపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. దీంతో పాటు సంబంధిత టీచర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా డీఈవోకు లెటర్ పంపించినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. ఈ కేసులో ఆమెకు కొంతమంది సహకరించినట్లు తెలిసిందని, వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమతుల్లేని విద్యా సంస్థలపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): అనుమతుల్లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్పందన కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఏలూరు నగరంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు భవనాలు ఇంకా పూర్తికాకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ పాఠశాలలకు అనుమతులు సరైన సమయంలో రాకపోతే విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు గ్యారెంటీ ఇస్తారని ప్రశ్నించారు. వెంటనే ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని పాఠశాలల పేర్లను డీఈఓ అధికారికంగా ప్రకటన విడుదల చేయాలని కోరారు. అనుతుల్లేకుండా ఎన్‌ఆర్‌పేట గ్రాండ్ ఆర్య హోటల్ రోడ్లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాఠశాల ఆవరణలో బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, ఇ.సాయి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయంలో విద్యార్థులతో వక్తలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు రిసోర్స్‌పర్సన్స్ పేర్కొన్నారు. స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం జరిగింది. రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామి, వి.జనార్ధనరావు, జి.బాపయ్యశర్మలచే కథలు వినడం, పుస్తకం చదవడం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిషు, పేపర్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, ఆటలు, పలు అంశాలను అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

గోగులమ్మ అమ్మవారికి విశేష పూజలు



కొర్రలబండిలో అమ్మవారి గ్రామోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో వేంచేసియున్న గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయం వద్ద విశేష పూజలు జరిగాయి. అమ్మవారి పుట్టింటి, అత్తింటి వారి నుంచి నైవేద్యాలు సమర్పించారు. కొర్రలబండిలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ సేవా సమితి కమిటీ నిర్వాహకులు రామిశెట్టి సురేష్ పర్యవేక్షించారు. మహిళలు, యువత, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు ఈ నెల 5వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్నందున చలో విజయవాడకు తరలిరావాలని తాడేపల్లిగూడెం తాలూకా యూనిట్ అధ్యక్షుడు నూతక్కి ప్రసాద్‌బాబు కోరారు. కోశాధికారి కిలారి రామకృష్ణ మాట్లాడుతూ సమావేశంలో 14 ప్రధాన డిమాండ్లుపై చర్చించడం, ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఉద్యోగులు హాజరై పెండింగ్ సమస్యలకు పరిష్కారం వచ్చే విధంగా కృషి చేద్దామని తెలిపారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాల్లో ఉన్న అన్ని శాఖల, అన్ని తరగతులు ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వినతుల స్వీకరణ



ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి పలు వినతులు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.వి.రమణ, అసిస్టెంట్ కమిషనర్ డి.రవికుమార్, ఏసీపీ జి.సీతారాం, మేనేజర్ రవి సుధాకర్, ఎం.హెచ్.ఓ ఎస్.రాజు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు మండల స్థాయి అధికారులు హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

అత్తిలిలో అఖండ అన్నసమారాధన

అత్తిలి: అత్తిలి శివారు బల్లిపాడు రోడ్డులో వేంచేసియున్న శ్రీకొండాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం అఖండ అన్నసమారాధన జరిపారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

నాడు మహారాణులు.. మహాశక్తి రూపాలు

- జగన్ హయాంలో ఐదేళ్లు మంచి రోజులు
- ఆర్థికంగా ఎదిగిన వైనం
- నేడు ఇల్లు గడవడమే కష్టంగా ఉందంటున్న మహిళామణులు
- కూటమి ప్రభుత్వం రాగానే సంక్షేమానికి బ్రేక్
- ఇస్తామన్న ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం ఏవంటున్న వైనం



తణుకులో వైఎస్సార్ చేయూత కార్యక్రమానికి హాజరైన మహిళలు. (ఫైల్)

తణుకు అర్బన్: నాడు మహారాణులుగా విరాజిల్లిన మహిళలు నేడు చేతిలో రూపాయిలేక ఇళ్లు గడిపేందుకు విలవిల్లాడుతున్నారు. కుటుంబ పెద్ద, యజమాని సంపాదన సరిపోక పప్పు బెల్లాలకు కూడా పక్కింటి తలుపుతట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. నాటి జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు అర్హులందరికీ ఏదోక సంక్షేమం ప్రతి ఏడాది అందడంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి బాటపట్టారు. చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ నిలదొక్కుకునే పరిస్థితి ఉండేది. కానీ నేటి కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాల అమలు చేయకపోవడంతో ఈ ఏడాది పాలనలో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నామంటూ వాపోతున్నారు. అర్హులైన వారికి ఏడాదికి ఒకటి నుంచి రెండు సంక్షేమ పథకాలు అందడంతో ఏడాది పొడవునా పండుగ వాతావరణంలా గడిపేవారమని, కానీ నేడు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేక పోగా కేవలం పెంచిన పింఛను వెయ్యి రూపాయిలు తప్ప మరే పథకం ఇవ్వలేదంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతాన్ని మెచ్చుకుంటున్న మహిళామణులు..

కులం, మతం, పార్టీ, వర్గ బేధాల్లేకుండా అర్హులైతే చాలు అమ్మ ఒడి నుంచి కాపు నేస్తం, వైఎస్సార్ నేస్తం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న తోడు వంటి పథకాల లబ్ధిని మహిళల బ్యాంకు ఖాతాలకే జమచేయడంతో ఆ లబ్ధిని జాగ్రత్తగా ఇంటి అవసరాలకు, చిన్నపాటి వ్యాపారాలకు మహిళలు వినియోగించేవారు. ఈ కారణంగా గత ప్రభుత్వ రోజులను మహిళలు నెమరివేసుకుంటున్నారు. దీంతో తమ ఇళ్లలో సైతం మాకు ఒక గుర్తింపు ఉండేదని, మహిళలపై గౌరవం కూడా పెరిగిందని చెబుతున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధితో తమ భర్తలను డబ్బులు అడగకుండానే తమతోపాటు పిల్లలకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసుకునే వారమని సంతోషంగా చెబుతున్నారు.

నేడు ఆ పథకాలేవి..

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈ నెల 4వ తేదీకి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీప్రకారం ఎటువంటి పథకాలు అమలు చేయలేదని మహిళలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం నడిపిన పథకాలను సైతం తొలగింపచేశారని విమర్శలు గుప్పిస్తున్నారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, రైతు భరోసా వంటి పథకాలు ఇవ్వకుండా ఇప్పటికే ఒక ఏడాది గడిపేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇంటి గుమ్మంలోకి వచ్చే వలంటీరు వ్యవస్థను తీసేయడం ద్వారా నేడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని, వలంటీర్లలో అధికశాతం మహిళలు ఉండగా వారి ఉపాధికి కూడా గండికొట్టారంటూ మండిపడుతున్నారు.

జనతా ట్రస్ట్ సేవలు అభినందనీయం



ఉచిత రక్త పరీక్షల శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని లయన్స్‌క్లబ్ సభ్యులు గ్రంధి సత్యనారాయణ అన్నారు. లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జనతా ట్రస్ట్ ఆవరణలో ఉచిత రక్త పరీక్షల శిబిరం జరిగింది. 110 మందికి పరీక్షలు చేశారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి రోజు తగిన వ్యాయామం, మిత ఆహారం తీసుకోవడం ద్వారా షుగర్ వ్యాధిని అదుపులో ఉంచవచ్చునని చెప్పారు. తగు సూచనలు ఇచ్చారు. అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి చిన్నం జగదీష్, జోన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్, గరికపాటి బాపయ్యశర్మ, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, జనతా డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వర రావు, నున్న సుందరం లయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాకు అందుబాటులో పూర్తి వైద్యం



పెదతాడేపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మలేరియా వ్యాధికి పూర్తి చికిత్స అందుబాటులో ఉందని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. సోమవారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా వైద్యులు హర్షకుమార్, రూపాదేవి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మలేరియా జ్వరాన్ని నిర్ధారించడానికి గోల్డెన్ మెథడ్ మైక్రోస్కోప్ ద్వారా నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ నెల 30వ తేది వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మలేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. హెల్త్, వెల్‌నెస్ కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మణరావు, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులకు వేతనాలు చెల్లించాలి



కొత్తూరులో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉపాధి హామీ పథకం బకాయి వేతనాలను శ్రామికులకు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకాన్ని పరిశీలించి, శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ గత ఎనిమిది వారాలుగా ఉపాధి వేతన బకాయిలు చెల్లించడం లేదని, తక్షణమే విడుదల చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని బలోపేతం చేస్తేనే ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోగలమన్నారు. సంఘ నాయకులు గోపిశెట్టి సూర్యనారాయణ, కొండపల్లి గణేష్‌రావు, మాసాబత్తుల రాము, గోపిశెట్టి సుబ్బారాయుడు, బండారు గంగమ్మ, గోపిశెట్టి దుర్గాభవాని, కోడే గంగమ్మ, ఉప్పు దుర్గ, ఇళ్ల సుబ్బారావు, బాదం సీతయ్య, రాయి గంగరాజు, ఉప్పు అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

జగ్గన్నపేటలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్



జగ్గన్నపేటలో జరిగిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆనందరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో సోమవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామన్నగూడెం శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ బఫెలో రీసెర్చ్ స్టేషన్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆనందరావు పశువుల సంరక్షణ, నిర్వహణపై రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అలాగే సెక్స్ సార్టెడ్ సెమన్, పెద్ద పశువులో కృత్రిమ గర్భధారణ, పశువులలో సరైన సమయంలో వేడిని గుర్తించడం, ఆహారం, గడ్డి నిర్వహణ, రోగ నిర్వహణ, పెద్ద పశువులకు టీకాలు టీకాల షెడ్యూల్‌ను తెలియజేశారు. మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ దేవీవర ప్రసాద్ రెడ్డి, ఐసీఏఆర్ (పెదవేగి) శాస్త్రవేత్త డాక్టర్ మేరీ రాణి, మండల ఉద్యాన శాఖఅధికారి శ్రీలక్ష్మి, డాక్టర్ విజయ్‌కుమార్ వారి వారి శాఖల పనితీరును వివరించారు. అలాగే, పెదతాడేపల్లిలో ముందస్తు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం, కడియద్ద గ్రామాల్లోనూ వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. జగ్గన్నపేట సర్పంచ్ ములకాల సూర్యారావు, కేవీకే విస్తరణాధికారి డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

భాస్కరరెడ్డికి అభినందనలు



కొవ్వూరి భాస్కరరెడ్డిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెంటపాడు: ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్న కూటమి ప్రభుత్వం చర్యలను వైఎస్సార్ పార్టీ యూత్ సంఘం ఎండగట్టాలని, తద్వారా యువతను వెన్నుతట్టేలా కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పెంటపాడుకు చెందిన కొవ్వూరి భాస్కరరెడ్డి పార్టీ యూత్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణను బాస్కరరెడ్డి పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త గాం. దీరెడ్డి, రెడ్డి కమ్యూనిటీ సొసైటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నల్లమిల్లి అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ సభ్యులు కర్రి వరహాలరెడ్డి, వెలగల శ్రీనివాస రెడ్డి, సుధాకరరెడ్డి, పృధ్వి, పద్మగణేష్‌రెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, సత్తి చంద్రారెడ్డి, శేషారెడ్డి, లింగారెడ్డి పెంటపాడు రెడ్డి సంఘ ప్రతినిదులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



బల్లిపాడులో రైతులతో మాట్లాడుతున్న కీటక విభాగం శాస్త్రవేత్త ఆనంద్‌కుమార్

అత్తిలి: సింథటిక్ పైరిత్రాయిడ్స్ రకాల మందులను వరిపైరులో ఎక్కువగా వాడరాదని కీటక విభాగం శాస్త్రవేత్త ఆనంద్‌కుమార్ అన్నారు. సోమవారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వరిపంటలో అనువైన రకాలు, మార్టేరు వరిపరిశోధన స్థానంలో వివిధ దశలలో ఉన్న విత్తనాలపై ప్లాంట్ బ్రీడర్ వెంకటరమణరావు అవగాహన కల్పించారు. రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దెబొరా, ఆయిల్ పాం శాస్త్రవేత్త మనోరమా, మండల వ్యవసాయ శాఖ అధికారి టీకే రాజేష్, ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, నాగబాబు, రైతులు పాల్గొన్నారు.

వ్యవస్థల విధ్వంసకర్త చంద్రబాబే

ఇరగవరం, అత్తిలిలో వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ



కొత్తపాడు గ్రామంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

ఇరగవరం: రాష్ట్రంలో వ్యవస్థలను విధ్వంసం చేస్తున్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే అని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. సోమవారం ఇరగవరం మండలంలోని కొత్తపాడు గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి మాట్లాడుతూ చంద్రబాబు ప్రజల్ని వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారని విమర్శించారు. ప్రజల సౌకర్యార్థం ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చక్కటి వ్యవస్థలను ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం వాటిని విధ్వంసం చేసి ప్రజలను కష్టపెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొపిశెట్టి అలివేలు మంగ తాయారు, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మాజీ సొసైటి అధ్యక్షులు పెన్మెత్స రామభద్ర రాజు పార్టీ మండల అధ్యక్షులు కొపిశెట్టి దుర్గా ప్రసాద్, మహిళ అధ్యక్షురాలు, ఎంపీటీసీ మెట్ల కిరాణ్మయి , పార్టీ మండల ఉపాధ్యక్షుడు జాలి సుబ్బరావు , సత్తి వెంకట రెడ్డి, ప్పారావు, వీరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినోత్సవాన్ని జయప్రదం చేయండి

అత్తిలి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సంక్షేమ పథకాలను గాలికొదిలేయడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నందున ఈనెల 4న వైఎస్సార్ సీపీ నిర్వహించే వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం అత్తిలిలో ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు కోట్లాది రూపాయలను సంక్షేమ పథకాల ద్వారా అందిస్తే, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన పథకాలను తుంగలో తొక్కి దుష్టపాలన సాగిస్తుందని విమర్శించారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ బియ్యం అందించే పథకానికి ఈప్రభుత్వ తూట్లు పొడిచి, పాత విధానంలో రేషన్ షాపుల ద్వారా సరుకులు విక్రయాలకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. రాష్ట్రంలో బెల్టుషాపుల ద్వారా మద్యం పారిస్తున్నారని, పేకాట వంటి జూదక్రీడలు యధేచ్ఛగా ఈప్రాంతంలో నిర్వహిస్తున్నారని దుయ్యబట్టారు. తణుకుపట్టణంలో ఈనెల 4న జరిగే వెన్నుపోటు దినోత్సవానికి మండలంనుంచి వేలాది మంది పార్టీశ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కష్టాలు.. మళ్లీ మొదలు

- ఇంటింటా రేషన్ పంపిణీకి కూటమి సర్కారు స్వస్తి
- డిపోల వద్ద సరుకుల పంపిణీతో లబ్ధిదారుల అవస్థలు
- చాలా చోట్ల సర్వర్ డౌన్



రేషన్ కోసం క్యూలో ఉన్న మహిళలు

తణుకు అర్బన్: ఎండీయూ వాహనాలను నిలిపివేసి రేషన్ దుకాణాల ద్వారా మాత్రమే రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుతో లబ్ధిదారుల ఇబ్బందులు రెండోరోజు కొనసాగాయి. ఆదివారం కూటమి ప్రభుత్వ ఆదేశాలతో లాంఛనంగా ప్రారంభించిన రేషన్ డిపోల ద్వారా బియ్యం పంపిణీ సోమవారం ప్రజానీకానికి చుక్కలు చూపించింది. ముఖ్యంగా క్యూలో నిలబడలేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అంతేకాకుండా సర్వర్ పనిచేయకపోవడంతో నిల్చున్నవారు నిల్చున్నట్లే గంటల తరబడి ఉండిపోవాల్సి రావడంతో ఎండ దెబ్బకు ప్రజలు నరకం చూశారు.

పనిచేయని సర్వర్లు...

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో ఉన్న రేషన్ డిపోల్లో సర్వర్ పనిచేయక పోవడంతో లబ్ధిదారులు నిలబలేక, ఇళ్లకు వెళ్లలేక నానాయాతన అనుభవించారు. సర్వర్ సామర్థ్యాన్ని పెంచకుండా రేషన్ డిపోల ద్వారా సరకులు పంపిణీ ప్రారంభించడం ఏంటని ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇంటి గుమ్మంలోకి వచ్చి సరుకులు పంపిణీ చేసినప్పుడు ఎటువంటి సర్వర్ సమస్యలు రాలేదని, కానీ నేడు ఎందుకు వస్తున్నాయంటూ డీలర్లను ప్రజలు నిలదీశారు. దీంతో కొన్ని డిపోల్లో జనం వేచిఉండగా, మరి కొన్ని డిపోల్లో మాత్రం జనంలేక ఖాళీగా దర్శనమిచ్చాయి. ఏమైతేనే వాహనాలను తొలగించడం, రేషన్ డిపోల ద్వారా బియ్యం ఇవ్వడాన్ని ప్రజానీకం తీవ్రంగా విమర్శిస్తున్నారు.

పడాలలో ఎక్సైజ్ తనిఖీలు



పడాల గ్రామంలో మద్యం బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలో సోమవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఆరు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి వివరించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు దొరబాబు, మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన



రేలంగిలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బయ్య

ఇరగవరం: మండలం రేలంగి గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీటీఆర్ఐ రాజమండ్రి ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బయ్య హాజరై మాట్లాడారు. రైతులు సరైన విత్తన ఎంపిక ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. ఎరువులు యాజమాన్యం సాగుపద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ హిమబిందు, ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణలో ఆరోగ్య సిబ్బంది పాత్ర కీలకం

పెనుగొండ: సామాజిక అంటువ్యాధుల నివారణలో ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా కలెక్టరు నాగరాణి అన్నారు. టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సిద్ధాంతంలో ఆమె ప్రారంభించారు. 25 మంది టీబీ రోగులను దత్తత తీసుకొని, వారికి పోషకాహారం అందించేందుకు రూ.75 వేలు చెక్కుతోపాటు, రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. సుగర్, స్మోకర్స్ ఆల్కహాల్ సేవించేవారు 60 ఏళ్లు దాటిన వారందరూ టీడీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. రెండు వారాల మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే స్థానిక ఆరోగ్య సిబ్బందిని కలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి భాను నాయక్, గ్రామ సర్పంచ్ చింతపల్లి గనిరాజు, తహసీల్దారు జి.అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

చౌక డిపో లేక ఇబ్బందులు

భీమవరం: ప్రతి నెలా ఇంటింటికి వచ్చే రేషన్ సరుకులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడడంతో భీమవరం మునిసిపాలిటీలోని 29వ వార్డు ప్రజ లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 29వ వార్డులో రేషన్ డిపో లేకపోవడంతో 30వ వార్డుకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ నెల నుంచి చౌక డిపోల వద్దనే రేషన్ సరుకులు అందజేస్తున్నా రు. అయితే 29వ వార్డు ప్రజలు 30వ వార్డులోని చౌక డిపో వద్ద సరుకులు తెచ్చుకోవల్సిరావడంతో సుమారు 2 కిలోమీటర్ల దూరం వెళ్లి బియ్యం మూటలు తెచ్చుకోవాలంటే వృద్ధులు, మహిళలకు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. 29వ వార్డులో సచివాలయం లేకపోవడంతో 31వ వార్డు సచివాలయానికి వెళ్లాల్సివస్తున్నదని దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.